సాక్షి
సిద్దిపేట
శనివారం । 1 । మార్చి । 2025



'పది'ంతల కసరత్తు
పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
వివరాలు 8లో ▸



మలుపులో 'మృత్యు'శకటం
ట్రక్కును కారు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు.
వివరాలు 8లో ▸



యథేచ్ఛగా మట్టి దందా
సిద్దిపేటలో అక్రమ మట్టి, మొరం దందా యథేచ్ఛగా నడుస్తోంది. అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
వివరాలు 8లో ▸

తలాపునే తపాస్‌పల్లి.. నీటికి తల్లడిల్లి

నీరు విడుదలకు నోచుకోక ఎండుతున్న పంటలు


తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటి నిల్వలు

- రిజర్వాయర్‌లో భారీగా తగ్గిన నీరు
- 82,542 ఎకరాల ఆయకట్టు
- రెండు ప్రధాన కాల్వలు, మరో 12డిస్ట్రిబ్యూటరీ కాల్వలు
- సిద్దిపేట, జనగామ జిల్లాలకు ఆధారం
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన

తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో నీరు లేక వెలవెలబోతోంది. సిద్దిపేట, జనగామ జిల్లాలకు ఆధారమైన ఈ రిజర్వాయర్‌కు 82,542 ఎకరాల ఆయకట్టు ఉండగా, 330ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్లు)నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. కానీ ప్రస్తుతం 95ఎంసీఎఫ్‌టీ మాత్రమే నీరు నిల్వ ఉంది. నీరు లేని కారణంగా ప్రస్తుత యాసంగిలో సాగునీరు విడుదల చేయడంలేదు. ఫలితంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం క్షేత్రస్థాయిలో 'సాక్షి' పరిశీలించగా ఎన్నో విషయాలు వెలుగుచూశాయి.

గజ్వేల్/కొండపాక....

కొమురవెల్లి మండలంలో ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించారు. సుమారు 300కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏటూరునాగారం సమీపంలోని సమ్మక్క బ్యారేజీ నుంచి ఇక్కడికి సాగునీరు వస్తుంది. ఈ క్రమంలో చివరగా జనగామ జిల్లా బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి ఇక్కడికి నీళ్లు వస్తాయి. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 330 ఎంసీఎఫ్‌టీ అంటే 0.33టీఎంసీలు. ఆయకట్టు 82,542 ఎకరాలకు పైనే. ఈ జలాశయం సిద్దిపేట, జనగామ జిల్లాలకు ప్రధాన ఆధారం.

ఎడమ కాల్వ ద్వారా..

రిజర్వాయర్ ఎడమ కాల్వ ఆధారంగా జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, కొండపాక, మద్దూరు మండలాలకు సాగునీరు అందుతున్నది. కుడి కాల్వ ద్వారా కొమురవెల్లి, చేర్యాలతోపాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాలకు సాగునీరు అందుతుంది. ఎడమ కాల్వ పరిధిలో 4 డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, కుడి కాల్వ పరిధిలో మరో 8 డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం రిజర్వాయర్‌లో కేవలం 95ఎంసీఎఫ్‌టీ మాత్రమే నీరు ఉంది. ఫలితంగా చాలా రోజులుగా ఈ రిజర్వాయర్ నుంచి కాల్వలకు సాగునీటిని వదలకపోవడంతో వేలాది ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఈ కాల్వల ద్వారా వచ్చే నీటితో నింపాల్సిన ఆయా జిల్లాల్లోని వందలాది చెరువుల, కుంటలు వెలవెలబోతున్నాయి. ఎడమ కాల్వ కొండపాక, దమ్మక్కపల్లి, సిరిసినగండ్ల, మర్పడగ, ఖమ్మంపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గిరాయిపల్లి, జప్తినాచారం, దుద్దెడ గ్రామాల గుండా 30కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నది. చాలా రోజులుగా ఈ కాల్వ గుండా సాగునీటి విడుదల లేక, కాల్వ పూర్తిగా వట్టిపోయింది. అంతేకాకుండా ఈ కాల్వ ఆధారంగా నీటిని నింపే అవకాశమున్న 33 చెరువులు, కుంటలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ఒక్క కొండపాక మండలంలోనే ఈ కాల్వ ఆధారంగా 15,542ఎకరాల ఆయకట్టు ఉన్నది. కానీ చాలా రోజులుగా సాగునీరు విడుదలకు నోచుకోక వేలాది ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.


కొండపాక మండలం నాగిరెడ్డిపల్లిలో ఎండిపోయిన వరిపొలం

ఆందోళనలో రైతులు..

ఈ సందర్భంగా రైతులను పలకరిస్తే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిపై ఆధారపడి వరి సాగు చేస్తే.. నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. మరోవైపు భూగర్భజలమట్టం సైతం గణనీయంగా పడిపోయిందని ఆందోళన చెందుతున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీరు వచ్చినా కొండపాక కాల్వకు సక్రమంగా నీటిని వదలడం లేదని చెబుతున్నారు. రిజర్వాయర్‌లో నీళ్లు ఉండే విధంగా చూస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నదని రైతులు చెబుతున్నారు.


ఎండిన పంట చేనులో పశువులను మేపుతున్న రైతు

ఎండిన వరి చేను.. పశువులకు మేతగా

చేర్యాల(సిద్దిపేట): ఎండిన వరి చేను పశువుల మేతగా మారింది. పట్టణ కేంద్రానికి చెందిన ఖాత ఆంజనేయులు 2 ఎకరాల్లో వరి పొలం వేశారు. చేనుకు సరిపడా నీరు అందక ఎండిపోయింది. ఎండిన వరి చేనులో పశువులను మేపుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరుబావి నుంచి నీరురాక పంట చేను ఎండిపోయిందని వాపోయాడు.

నీళ్లు రాక వట్టిపోయిన చెరువులు



గతంలో కొండపాక కాల్వకు తపాస్‌పల్లి రిజర్వాయర్ నీరు వచ్చేవి. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండేది. కానీ ప్రస్తుతం నీరు వదలడం లేదు. భూగర్భజలం సైతం తగ్గింది. దీంతో యాసంగి వరి పంటలు ఎండిపోతున్నాయి. – జిర్ర రాజు, రైతు, ఖమ్మంపల్లి, కొండపాక

మల్లన్నసాగర్‌తో లింక్ చేయాలి



తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాల్వలకు నీరు వస్తలేవు. మల్లన్నసాగర్ ద్వారా సాగునీరు వచ్చేలా చేయాలి. లేదంటే పంటలు ఎండిపోవడం ఖాయం. నీళ్లు లేక ఇప్పటికే పంటలు ఎండిముఖం పట్టాయి. – చెంది అంజనేయులు, రైతు, సిరిసినగండ్ల, కొండపాక

సాగునీటిని వదలండి



తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి వెంటనే సాగునీటిని వదలి పంటలను కాపాడాలి. ఇప్పటికే తీవ్రనష్టం జరిగిపోయింది. నీరు వదలకపోతే మరింత నష్టం జరుగుతుంది. – దొమ్మాట మహిపాల్‌రెడ్డి, రైతు, కొండపాక

త్వరలోనే కాల్వలకు నీరు

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు 30కిలోమీటర్ల దూరంలో ఉన్న బొమ్మకూరు జలాశయం నుంచి ఇక్కడికి దేవాదుల నీరు రావడం ప్రారంభమైంది. కొద్ది రోజుల్లో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి.. కాల్వల ద్వారా నీటిని అందించి పంటలను కాపాడుతాం. రైతులు ఆందోళన చెందవద్దు. – అంజయ్య, డీఈ, ఇరిగేషన్ తపాస్‌పల్లి రిజర్వాయర్

న్యూస్‌రీల్

పుస్తక పఠనంతోనే బంగారు భవిష్యత్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


మొబైల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పుస్తక పఠనం ద్వారానే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా మొబైల్ లైబ్రరీని గరిమా అగర్వాల్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు పుస్తకాలు చదవాలన్నారు. పుస్తక పఠనంతో జ్ఞానంతో పాటుగా మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. సంచార పుస్తక ప్రదర్శనలు విద్యావంతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌బీటీ రీజినల్ మేనేజర్ డాక్టర్ పత్తిపాక మోహన్, సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, మండల విద్యాధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగిరం చేయండి

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. పనుల ప్రగతిపై అడిగి తెలుసుకున్నారు. పర్యాటక శాఖ అధికారులు చెరువు సుందరీకరణ ఫొటోలను అదనపు కలెక్టర్‌కు చూపించారు. చిత్రాలను చూసి పనులు తొందరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన


విద్యార్థులను అభినందిస్తున్న సైన్స్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని రాష్ట్రపతి నిలయంలో జిల్లాకు చెందిన రెండు ఎగ్జిబిట్లను ప్రదర్శించినట్లు సైన్స్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 40 ప్రదర్శనలు ఎంపిక కాగా, ఇందులో 2 ప్రదర్శనలు సిద్దిపేట జిల్లావి ఉన్నాయన్నారు. దామరకుంట భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థి అశ్వంత్ రూపొందించిన ప్రాజెక్టుతో పాటుగా, లచ్చపేట ఉపాధ్యాయురాలు జ్యోతి పర్యవేక్షణలో 9వ తరగతి విద్యార్థి హర్ష వర్ధన్ రూపొందించిన రాకెట్ లాంచింగ్ విధానాన్ని ప్రదర్శించారని తెలిపారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

జిల్లాలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు


సిద్దిపేటలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. అనంతరం మంచి ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో బీఎస్ఎంఏఆర్‌టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ సృజనాత్మకతను పెంపొందించుకోవాలనిసూచించారు.

అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట కోర్టు భవనంలో న్యాయవాదులు, ప్యారా లీగల్ వలంటీర్స్‌తో శుక్రవారం న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం
- అధికారులకు దిశానిర్దేశం


మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే టెన్త్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 79 పరీక్షా కేంద్రాల్లో 14,138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందుకు చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చూడాలన్నారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీఓలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు క్లియర్ చేయండి

సిద్దిపేటరూరల్: పెండింగ్ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిశీలించి మార్చిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఎల్‌ఆర్‌ఎస్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీఓలు, డీపీఓ, డీటీసీపీఓ, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

విధుల్లో అలసత్వం తగదు

- ఇంటర్ పరీక్షలు బాధ్యతగా చేపట్టాలి
- డీఐఈఓ రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఐఈఓ, పరీక్షల కమిటీ కన్వీనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. పరీక్షల విధుల్లో పాల్గొననున్న చీఫ్‌సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీఓ), కస్టోడియన్లు, స్క్వాడ్స్ సభ్యులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, అపరిచితులను ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాలకు అనుమతించకూడదని చెప్పారు. సమావేశానికి అబ్జర్వర్‌గా విచ్చేసిన ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ(అకౌంట్స్) భీమ్‌సింగ్ మాట్లాడుతూ ప్రత్యేకమైన శ్రద్ధతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షల నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ప్రశ్నాపత్రాల బల్క్ సెంటర్ ఇంచార్జి దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారి సస్పెన్షన్


నాగరాజు

హుస్నాబాద్‌రూరల్: మండల వ్యవసాయ అధికారి నాగరాజు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ గోపి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు. సీసీఐ కేంద్రాల్లో వ్యాపారులు పత్తి విక్రయించడానికి బోగస్ రైతుల పేరున ఏఈఓల సంతకాలు ఫోర్జరీ చేసి టీఆర్‌లను ఇచ్చినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. మీర్జాపూర్, హుస్నాబాద్, మహ్మదాపూర్ క్లస్టర్ల పరిధిలో 18 మంది బోగస్ రైతులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంతో వ్యాపారులు 946 క్వింటాళ్ల పత్తిని సీసీఐలో అమ్ముకున్నారు. ఫోర్జరీ సంతకాలను గుర్తించిన ఏఈఓలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి, మార్కెటింగ్ అధికారి సంయుక్తంగా విచారణ చేసి కలెక్టర్‌కు నివేదికను అందించారు. విచారణ నివేదికను పరిశీలించి వ్యవసాయ కమిషనర్ గోపి సస్పెండ్ చేసినట్లు ఏడీఏ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

హుస్నాబాద్ కోర్టు జడ్జి కృష్ణతేజ్

హుస్నాబాద్: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ కోర్టు జడ్జి కృష్ణతేజ్ అన్నారు. మండలంలోని పొతారం(ఎస్) సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్సియల్ హాస్టల్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అ సందర్భంగా కృష్ణతేజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పైనే దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాల వైపు వెళ్లొద్దని సూచించారు. నేషనల్ సైన్స్ డే పురస్కరించుకుని సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ ప్యానెల్ అడ్వకేట్ కొంకట శ్రీనివాస్, పారా లీగల్ వలంటీర్ శ్రావణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

చికెన్ తిందాం.. ఆరోగ్యంగా ఉందాం


చికెన్ మేళాకు హాజరైన జనం

- తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- బాగా ఉడకబెడితే వైరస్ సోకదు
- చికెన్, ఎగ్ మేళాలో ఎమ్మెల్యే హరీశ్ రావు


చికెన్ తింటున్న హరీశ్‌రావు తదితరులు

సిద్దిపేటజోన్: 'చికెన్ తిందాం.. ఆరోగ్యంగా ఉందాం. ఇప్పుడు నేను కూడా చికెన్ తింటున్నా . మీరు కూడా తినండి. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పౌల్ట్రీ రైతుల ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్ మేళాలో ఆయన పాల్గొన్నారు. కొంతమంది సృష్టించిన అపోహలతో మాంసం ధరలు కొండెక్కాయన్నారు. 70 డిగ్రీల వరకు ఉడకబెడితే ఎలాంటి వైరస్ సోకదని హరీశ్‌రావు తెలిపారు. గతంలో ఇలాంటి అపోహలు వస్తే కేసీఆర్‌తో పాటు ప్రజాప్రతినిధులు అంతా చికెన్ తిని అపోహలను దూరం చేశామన్నారు. చికెన్, ఎగ్‌లు ఆరోగ్యానికి మేలన్నారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద పౌల్ట్రీ సిద్దిపేట జిల్లాలో ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు వేణుగోపాల్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్లు

అధ్యయన బాట

సిద్దిపేట జోన్: రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీ అధికారులు శుక్రవారం సిద్దిపేట బల్దియాలో అధ్యయనం చేశారు. చెత్త సేకరణ, తడి పొడి హానికర చెత్త విభజన, వర్మీ కంపోస్టు, తదితర అంశాలపై ఆరా తీశారు. వీరికి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్ వివరించారు. సిద్దిపేటను సందర్శించిన వారిలో యాదగిరిగుట్ట, మోత్కూర్, జనగామ, భువనగిరి, రామయంపేట,హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, హుజురాబాద్‌లకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థి అరవింద్

దుబ్బాకటౌన్: పాఠశాల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించే సౌత్ జోన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పీ.అరవింద్ ఎంపిక య్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పీడీ గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్ర వారం వారు మాట్లాడుతూ.. జాతీయ స్థాయి లో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. నేటి నుంచి 3 వరకు నల్గొండ జిల్లా ఎన్జీ స్టేడియంలో నిర్వహించే నాలుగో సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో అరవింద్ పాల్గొంటాడని పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి
- అంతర్‌జిల్లా బేస్‌బాల్ పోటీలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న నర్సారెడ్డి, తదితరులు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఐవోసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) పక్కన గల మైదానంలో బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లా) చాంపియన్ షిప్ 2025 (బాలుర, బాలికల సబ్ జూనియర్) బేస్ బాల్ పోటీలను శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆటల పోటీల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. గజ్వేల్ అదనపు సీపీ ముత్యంరాజుతోపాటు వరల్డ్ కబడ్డీ ఫెడరేషన్ టెక్నికల్ డైరెక్టర్ జగదీశ్వర్ యాదవ్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సెక్రటరీ శ్వేత, బేస్ బాల్ జిల్లా అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి, చైర్మన్ వెంకటేశ్ గౌడ్, సెక్రటరీ మధు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టపగలే దారి దోపిడీ

- బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించిన నలుగురు వ్యక్తులు
- కిందపడేసి బంగారు ఆభరణాలు చోరీ

వట్‌పల్లి(అందోల్): పట్టపగలే నాందేడ్‌-అకోలా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనదారుడిపై దాడి చేసి బంగారం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన అల్మాయిపేట వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. అందోలు మండల పరిధిలోని సంగుపేట గ్రామానికి బాబూరావు బైక్‌పై స్వగ్రామం నుంచి జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో చౌటాకూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అల్మాయిపేట గ్రామ శివారులోకి వెళ్లగానే ఎదురుగా రెండు బైక్‌పై నలుగురు వ్యక్తులు వచ్చి బాబురావును పలకరించారు. బాబురావు బైక్ వేగాన్ని తగ్గించగా వెంటనే నలుగురు వ్యక్తులు తమ రెండు బైకులను అడ్డుపెట్టారు. బైక్ పై నుంచి బాబురావును కిందికి లాగి అతడి మెడలోని బంగారు చైన్ , ఉంగరం, బ్రాస్‌లెట్‌ను బలవంతంగా లాక్కెళ్లారు. అనంతరం బాధితుడు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు దొంగలు జోగిపేట వైపు వెళ్లినట్లు చెప్పడంతో సీసీ పుటేజీల పరిశీలించి నిందుతులను పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పదింతల కసరత్తు

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించడానికి విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉపాధ్యాయులు సైతం ఈ సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పది పరీక్షలు జరుగనున్నాయి.

– దుబ్బాకటౌన్:


లచ్చపేట మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు
- మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 14,124 మంది విద్యార్థులు
- 79 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

14,124 మంది విద్యార్థులు

సిద్దిపేట జిల్లాలో 14,124 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయడానికి సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో 79 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణుడు కావాలని, జిల్లా శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే ప్రధాన లక్ష్యంతో అన్ని ఉన్నత పాఠశాలల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రతీ ఆదివారం వారాంతపు పరీక్షలు నిర్వహించి ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం చదువుకునే విధంగా ఫోన్ చేసి వారిని ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల తరగతులకు అదనంగా రెండు గంటలపాటు ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడూ నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలపై భయాందోళనలు తొలగిస్తున్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలని, ఇంటి వద్ద చదువుకునేలా చూడాలని చెబుతున్నారు.

ఉత్తమ ర్యాంక్ సాధిస్తా..



వచ్చే నెలలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్ సాధించే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకున్నాను. దాని ప్రకారం చదువుతాను. పాఠశాలలో స్టడీ అవర్స్ సమయంలో నాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

– అక్షయ, 10వ తరగతి విద్యార్థి, మోడల్ స్కూల్ లచ్చపేట

సబ్జెక్ట్‌ల వారీగా దృష్టి



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఎంతగానో దోహదపడుతున్నాయి. సందేహాలను ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు. సబ్జెక్ట్‌ల వారీగా ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా కృషి చేస్తున్నారు.

– వంశీ, 10వ తరగతి విద్యార్థి, మోడల్ స్కూల్ లచ్చపేట

శతశాతం కోసం ప్రత్యేక తరగతులు



జిల్లాలో 14,124 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతీ పాఠశాలలో ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ సైతం ఎప్పటికప్పుడు పర్యావేక్షిస్తున్నాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులు వంద శాతం పాసయ్యేలా కృషి చేస్తాం.

– శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాధికారి


స్టడీ అవర్‌లో చదువుకుంటున్న దామరకుంట పదవ తరగతి విద్యార్థులు

242 మంది విద్యార్థులు

మర్కూక్(గజ్వేల్): జిల్లా విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా 'పది' పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధన ఏకైక లక్ష్యంగా మర్కూక్ మండల విద్యాశాఖ కసరత్తులు మొదలయ్యాయి. ఈ మేరకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నది. మర్కూక్ మండలంలో నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా బాలికల గురుకుల ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఈ పాఠశాలల నుంచి గతేడాది 227 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 224 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసారి మర్కూక్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 242 విద్యార్థులు ఉన్నారు. మర్కూక్ జెడ్పీ హైస్కూల్‌లో 68 మంది, చేబర్తి 17, దామరకుంట 41, పాములపర్తి 63, కస్తూర్బా గురుకులంలో 53 మంది విద్యార్థినీలు పది పరీక్షలు రాయనున్నారు.

నూరు శాతం లక్ష్యాలు సాధిస్తాం



పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. జిల్లా విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పిల్లలు గైర్హాజరైతే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్తున్నాం. విద్యార్థి చదువుల తీరుపై నిరంతర నిఘా పెడుతున్నాం. ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా జాగ్రత్త వహిస్తున్నాం.

– వెంకటేశం, హెచ్‌ఎం, మర్కూక్ జెడ్పీ హైస్కూల్

ఇసుక డంప్ సీజ్

- రెండు ట్రాక్టర్లు పట్టివేత


ట్రాక్టర్, ఇసుక డంప్‌తో పోలీసులు

తొగుట(దుబ్బాక): అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన తొగుట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగారంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన బోయిని భిక్షపతి, పోతరాజు భిక్షపతితో పాటు మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సింగారం శివారులోని కూడవెల్లి వాగు వద్ద అక్రమంగా ఇసుకను డంప్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, తొగుట పోలీసులు దాడి చేసి 70 టన్నుల ఇసుకను సీజ్ చేసి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం, మట్టి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


సతీశ్ (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొట్టిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం....పొట్టిపల్లి గ్రామానికి చెందిన మునిపల్లి సతీశ్(28)కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. మృతుడు మద్యానికి బానిసై గురువారం రాత్రి తన భార్యతో గొడవపడ్డాడు. అనంతరం భోజనం ముగించుకుని తన గదిలోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి తలుపులు తెరిచి చూసేసరికి చున్నీతో ఉరేసుకుని దూలానికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

మలుపులో 'మృత్యు'శకటం

- ట్రక్కును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- గౌరారం వద్ద రాజీవ్‌రహదారిపై ఘటన


ఘటనా స్థలంలో ట్రక్కు, కారు

వర్గల్(గజ్వేల్): ట్రక్కును కారు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మేడ్చల్ టీచర్స్ కాలనీకి చెందిన శ్యామ్ బహదూర్‌సింగ్(41)కు భార్య సంగీత సింగ్, కుమారుడు ఉన్నారు. ముప్పిరెడ్డిపల్లిలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కారులో తన మిత్రులైన మేడ్చల్‌కు చెందిన మెండె చందుయాదవ్, వాకిటి సాయికుమార్‌తో కలిసి సిద్దిపేట జిల్లా రాయిపోల్ నుంచి మేడ్చల్‌కు వస్తున్నారు. గౌరారంలోని మామిడ్యాల్ కమాన్ దగ్గరికి రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న ట్రక్కు డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్ వేయకుండానే కమాన్ వైపు వాహనాన్ని తిప్పాడు. దీంతో అడ్డుగా వచ్చిన ట్రక్కును కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక సీటులో కూర్చున్న శ్యాం బహదూర్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవర్ చందుయాదవ్, పక్కన కూర్చున్న సాయి కుమార్ గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సంగీత సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


శ్యాం బహదూర్‌సింగ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

- స్కూటీతో వాటర్ ట్యాంకర్‌ను ఢీ
- సదాశివపేట పట్టణంలోని జాతీయ రహదారిపై ఘటన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని విద్యార్థి మృతి చెందిన ఘటన సదాశివపేట పట్టణంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. పట్టణంలోని గురునగర్ కాలనీకి చెందిన సాయి కార్తీక్(18) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురునగర్ కాలనీ నుంచి సదాశివపేట బస్టాండ్ వైపు పని నిమిత్తం స్కూటీపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో అస్రా కాంప్లెక్స్ ఎదుట డివైడర్ మధ్యలో మొక్కలకు నీళ్లు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు, ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

సైకిల్‌పై నుంచి పడి వ్యక్తి

కొండపాక(గజ్వేల్): సైకిల్‌పై నుంచి పడి తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. కొండపాక మండలంలోని మర్పడగ గ్రామానికి చెందిన గుడికందుల భిక్షపతి (40)పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. గురువారం సాయంత్రం గ్రామంలోని దుకాణంలో నిత్యావసర సరుకులు తీసుకొచ్చేందుకు సైకిల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా కుటుంబీకులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో మండలి సమావేశం

- పరిశోధన, విస్తరణ అంశాలపై ప్రముఖుల చర్చ

ములుగు(గజ్వేల్) : ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ డీ.రాజిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం పరిశోధన, విస్తరణ మండలి(ఆర్‌ఈసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, పట్టు పురుగుల పెంపకం, వ్యవసాయ మార్కెటింగ్, అటవీ, తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థలకు చెందిన అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, నిర్వహణ బోర్డు సభ్యులు, ప్రగతి శీల రైతులు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భగవాన్, విస్తరణ అధికారి విజయ మాట్లాడుతూ.. పరిశోధన, విస్తరణ ముఖ్యాంశాలపై వివరించారు. పునరుత్పాదక వ్యవసాయం, పంట వైవిధ్యీకరణ, నాణ్యమైన విత్తనాలు నాటడం, పదార్థాల లభ్యత, తెగులు, వ్యాధుల నివారణ, మార్కెట్ నిఘా, యాంత్రీకరణ, విలువ జోడింపు, ప్రాసెసింగ్, ఎగుమతి వంటి విస్తృత శ్రేణి అంశాలపై అధికారులు చర్చించారు. తెలంగాణలోని రైతు సమాజానికి స్థిరమైన వృద్ధి, ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారించడం ద్వారా ఉద్యాన, అనుబంధ రంగాల్లో రైతుల లాభదాయకతను పెంచే ప్రభావవంతమైన వ్యూహాలను అమలు చేయడానికి ఉద్యానవన శాఖ, ఏపీఈడీఏ, వ్యవసాయ మార్కెటింగ్ సహకారంతో కార్యాచరణ ప్రణాళికను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అనంతరం విశ్వవిద్యాలయం 9వ వార్షిక నివేదిక (2023–24)ను వైస్ ఛాన్స్‌లర్ రాజిరెడ్డి ఆవిష్కరించారు.


వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వీసీ రాజిరెడ్డి, అధికారులు

పరిశోధనల వైపు దృష్టి సారించాలి


విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న సురేందర్, ప్రిన్సిపాల్ తదితరులు

- విజ్ఞాన శాస్త్రంలోని మార్పులను గమనించాలి
- విద్యార్థులకు ఇస్రో శాస్త్రవేత్త సురేందర్ సూచనలు

సిద్దిపేటఎడ్యుకేషన్: సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిశోధనల వైపు మళ్లి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ సురేందర్ ఆకాంక్షించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో తెలంగాణ అకాడమీ అఫ్ సైన్సెస్, ఇండియన్ అసోసియేషన్ ఫిజిక్స్ టీచర్స్ సౌజన్యంతో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజ్ఞాన శాస్త్రంలో వస్తున్న మార్పులను నిరంతరం గమనిస్తూ యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అన్న అవకాశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం నాలుగు రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడుతూ.. అధ్యాపకులు చక్కని కార్యక్రమాన్ని నిర్వహించారని, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సైన్స్ విభాగాధిపతులను, అధ్యాపకులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డా.మధుసూదన్, నిర్వాహక కార్యదర్శి డా. అయోధ్యరెడ్డి, సీఓఈ డా.గోపాల సుదర్శనం, శ్రీధర్, రోహిని, డాక్టర్లు మదన్‌మోహన్, పవన్‌కుమార్, రాణి, మహేశ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శైలజ పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

జాతరకు వచ్చి భక్తుడు

కొల్చారం(నర్సాపూర్): ఏడుపాయల జాతరకు వచ్చి భక్తుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా బాగారెడ్డి గ్రామానికి చెందిన పేర్ల పెంటయ్య గురువారం జాతరకంటూ ఏడుపాయలకు వచ్చాడు. శుక్రవారం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య లక్ష్మీ కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోటల్ నుంచి వెళ్లి వ్యక్తి

సిద్దిపేటఅర్బన్: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మద్దూరు మండలం తోర్నాల గ్రామానికి చెందిన బోయిని అజయ్ (24) అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులోని వింటేజ్ విలేజ్ హోటల్‌లో ఏడాది నుంచి క్లీనింగ్ వర్క్ చేస్తున్నాడు. 26న రాత్రి భోజనం చేసిన అనంతరం తోటి పనివారితో కలిసి నిద్ర పోయాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. వెంటనే యజమానికి విషయం చెప్పారు. కుటుంబ సభ్యులను ఆరా తీయగా తమ వద్దకు రాలేదని చెప్పారు. అజయ్ చెల్లి దీపిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్వారీ కూలి హిటాచీ డ్రైవర్ మృతి

- గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి శివారులో ఘటన


క్వారీలో కూలిన మట్టి దిబ్బలు

జిన్నారం (పటాన్‌చెరు): కంకర క్వారీలో బండరాళ్లు కూలి మీద పడటంతో హిటాచీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి శివారులో చోటు చేసుకుంది. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. మహబూబ్ నగర్ జిల్లా గడ్డంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్(30) జీవన ఉపాధి కోసం ఖాజీపల్లి గ్రామానికి వచ్చి భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతడు గ్రామ శివారులోని గంగోత్రి కంకర క్వారీలో హిటాచీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రోజు లాగే విధులకు వెళ్లాడు. క్వారీలోని బండరాళ్లను టిప్పర్ లారీలో లోడ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పైనుంచి బండరాళ్ల దిబ్బ మీద పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్వారీలో పని చేస్తున్న కార్మికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- బక్రిచెప్యాల గ్రామంలో రోజుల తరబడి తరలింపు
- జేసీబీ, టిప్పర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు


ఘటనా స్థలంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది


టిప్పర్‌లో మట్టి నింపుతున్న జేసీబీ

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలంలో అక్రమ మట్టి, మొరం దందా యథేచ్ఛగా నడుస్తోంది. రోజుల తరబడి అక్రమంగా మట్టి, మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం బక్రిచెప్యాల గ్రామంలో అక్రమంగా మొరంను టిప్పర్లలో నింపుతుండగా రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి జేసీబీని, మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బక్రిచెప్యాల, వెల్కటూర్ గ్రామాల మధ్యలో వ్యవసాయ బావికి సంబంధించిన మొరం దిబ్బ నుంచి అక్రమంగా మొరంను తరలిస్తున్నారు. గ్రామం మధ్యలో నుంచి మూడు రోజులుగా ఇష్టారీతిన టిప్పర్లలో తరలిస్తుండటంతో దుమ్ముతో ఇబ్బంది పడిన గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు మట్టిని తరలిస్తున్న ప్రాంతానికి వెళ్లి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టా భూమి అయినా సరే మట్టిని తరలించాలంటే మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పాపయ్య, కానిస్టేబుళ్లు అమృత్, కిషోర్, కల్యాణ్, రెవెన్యూ సిబ్బంది బాలు పాల్గొన్నారు.